క్లుప్తంగా

విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న దాత వెంకట సత్యనారాయణ, రాజ్యలక్ష్మి దంపతులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్‌బీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి శనివారం షీలానగర్ వేంకటేశ్వరకాలనీకు చెందిన వెంకటసత్యనారాయణ, రాజ్యలక్ష్మి దంపతులు రూ.11 వేలు దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు అందజేశారు. వారికి ఆలయ అర్చకులు శ్రీవారి దర్శనం కల్పించారు.

సెల్‌ఫోన్ల చోరీ కేసులో ముగ్గురు అరెస్ట్

అక్కిరెడ్డిపాలెం: సెల్‌ఫోన్ల చోరీ కేసులో ఓ నిందితుడితో పాటు ఇద్దరు మైనర్లను గాజువాక క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. గాజువాక క్రైం ఎస్ఐ మన్మథరావు తెలిపిన వివరాల ప్రకారం.. బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి నుంచి, కళాశాల నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థి నుంచి ముగ్గురు సెల్‌ఫోన్లు తీసుకొని పరారయ్యారు. దీంతో వారు గురువారం గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో క్రైం ఎస్ఐ ఎ.మన్మథరావు సీసీ పుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించారు. గాజువాక బీసీ రోడ్డులోని నీటి ఏనుగు బొమ్మ జంక్షన్ వద్ద పెదగంట్యాడ దయాళ్‌నగర్ చలపతి స్కూల్ వెనుక నివాసం ఉంటున్న దుర్గాప్రసాద్ (19)తో పాటు ఇద్దరు మైనర్లను అరెస్ట్ చేసి వారి నుంచి స్కూటీ, 2 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దుర్గాప్రసాద్‌పై ఇప్పటికే గాజువాక పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు ఉన్నాయన్నారు.

కృత్రిమ మేధతో అనూహ్య పరిణామాలు



మాట్లాడుతున్న ఇన్ఫోసిస్ క్వాలిటీ ఇంజినీర్ హరీష్

అగనంపూడి: కృత్రిమ మేధస్సు అనూహ్య పరిణామాలకు దారితీస్తుందని ఇన్ఫోసిస్ క్వాలిటీ ఇంజినీర్ మాలి హరీష్ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ డేటా సైన్స్ మెషీన్ లెర్నింగ్ డీప్ లెర్నింగ్ అంశాల్లో రెండు రోజుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇంటర్వ్యూ సమయంలో ఎదురయ్యే సమస్యలు, వాటిని ఎలా ఎదుర్కోవాలనే అంశాలను వివరించారు. మనిషి జీవితంలో అనేక మార్పులకు ఏఐ కేంద్ర బిందువు కానుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉక్కు పోరాట కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర

ఉక్కునగరం: ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గాజువాకలో పాదయాత్ర నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఉదయం 9 గంటలకు పాత గాజువాక నుంచి కొత్త గాజువాక వరకు పాదయాత్ర నిర్వహించనున్నారు. అనంతరం అక్కడ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు తమ కుటుంబ సభ్యులతో హాజరు కావాలని పోరాట కమిటీ నాయకులు కోరారు.

బీజేపీ నాయకుల సంబరాలు

గాజువాక: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై ఆ పార్టీ గాజువాక నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పాతకర్నవానిపాలెంలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో దీనంకొండ కృష్ణంరాజు, సోంబాబు, బాటా శ్రీను, గరికిన పైడిరాజు, రోహిణి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మన తాగునీరు సురక్షితమేనా?!

మురుగు కాలువల్లో తాగునీటి పైప్‌లైన్లు



87వ వార్డులో గెడ్డలో తాగునీటి పైప్‌లైన్



67వ వార్డులో మురుగునీటి కాలువ పక్కన తాగునీటి పైప్‌లైన్

గాజువాక: జీవీఎంసీ సరఫరా చేస్తున్న తాగునీటిలో నాణ్యత ఎంత అనేది ప్రశ్నార్థకమవుతోంది. అది సురక్షితమేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నగరంలో తాగునీటి పరీక్షలు జరుగుతున్నాయో.. లేదో దానిపై పర్యవేక్షణ ఎంత ఉంటుందో వంటి అనేక ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. నీటిని శుద్ధి చేసిన ప్లాంట్‌లో పరీక్షలు కాకుండా కుళాయికు చేరుకొనే పాయింట్ల వద్ద నీటి నాణ్యత ఎంత అనే విషయంలో అధికారుల కనీస పర్యవేక్షణ ఉండటంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. తాగునీటి నాణ్యతను నిర్ధారించడానికి ఎక్కడికక్కడ నీటి శాంపిల్స్ సేకరించి పరీక్షలు జరపాల్సి ఉండగా, గాజువాక జోన్‌లో అలాంటి చర్యలు చేపట్టిన దాఖలాలే కనిపించని పరిస్థితి ఉంది. ఫలితంగా తాగునీటిలో కలుషిత జలాలు చేరి జనం ప్రజల ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. తాజాగా గాజువాకలోని 67వ వార్డు సాయిరామ్‌నగర్‌లో ప్రబలిన అతిసార ఈ అనుమానాలను మరింత బలపర్చుతోంది.

మురుగునీటి కాలువల్లో తాగునీటి పైప్‌లైన్లు

గాజువాకలో జీవీఎంసీ వాటర్ పైప్‌లైన్లు అధిక శాతం మురుగునీటి కాలువల్లో, కాలువలను ఆనుకొని ఉన్నాయి. అనేక సందర్భాల్లో ఈ పైప్‌లైన్లకు రంధ్రాలు ఏర్పడి తాగునీరు కలుషితమవుతోందని జీవీఎంసీ అధికారులకు తరచూ ఫిర్యాదులు అందుతున్న విషయం తెలిసిందే. నీరు రంగు మారిపోవడం, దుర్వాసన వెదజల్లడం వంటి ఫిర్యాదులు జోనల్ అధికారులకు అందుతున్నాయి. సాయిరామ్‌నగర్‌లో ఈ కారణంగానే అతిసార ప్రబలింది. ఈ సంఘటన జరిగిన తర్వాత జీవీఎంసీ సరఫరా చేసే నీరు తాగడానికి జనం భయపడే పరిస్థితి వచ్చింది.

30 ఏళ్ల నాటి పైపులే..



గెడ్డలోని మురుగునీటిపై తాగునీటి పైప్‌లైన్

గాజువాక పట్టణంలో 30 ఏళ్ల కిందట వేసిన పైపులే ఇప్పటికీ ఉన్నాయి. ప్రస్తుతం అవి శిథిలావస్థలో ఉండడంతో తరచూ లీకైపోతున్నాయి. వాటికి మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా నిర్వహించడమే తప్పా శాశ్వత పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలున్నాయి. పైప్‌లైన్ లీకవుతున్నట్టు ఫిర్యాదు వస్తే నాలుగు రోజుల తర్వాత గాని సిబ్బంది స్పందించడం లేదన్న ఆరోపణలున్నాయి. ఈలోగా జరగాల్సిన నష్టం జరిగిపోతోందని పలువురు పేర్కొంటున్నారు. ఈ సంఘటన నేపథ్యంలోనైనా అధికారులు స్పందించి తాగునీరు కలుషితం కాకుండా చూడాలని జనం కోరతున్నారు.

ఉక్కులో భద్రతకు అధిక ప్రాధాన్యం

- స్టీల్‌ప్లాంట్ వర్క్స్ సీజీఎం శ్రీధర్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ వర్క్స్ సీజీఎం శ్రీధర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని.. ప్రమాదాలు జరగకుండా ప్రతీ ఒక్కరూ భద్రత ప్రమాణాలు పాటించాలని స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) యు. శ్రీధర్ అన్నారు. ఎల్‌డీసీ ఆడిటోరియంలో శనివారం సేఫ్టీ కమిటీ సభ్యులకు ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కర్మాగారంలో భద్రతా లోపాలు ఉంటే వెంటనే యాజమాన్యం దృష్టికి తీసుకు వస్తే సమష్టిగా పరిష్కరించి ప్రమాదాలు జరగకుండా చూడవచ్చన్నారు. ఉక్కు కర్మాగారంలో ప్రతీ కార్మికుడు విధిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని, ఒక్క ప్రమాదంతో కుటుంబం విచ్ఛిన్నం అవుతుందన్నారు. సురక్షిత పని వాతావారణం మన అందరి విజయానికి పునాది అని అన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కూడా భద్రతపై అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సీజీఎం ప్రవీణ్ కుమార్, సుందర కుమార్, ఎం.ఎస్.ఎన్. రాజు, భద్రతా విభాగం అధికారులు వరప్రసాద్, రుద్రప్ప, వర్గీస్, మోహన రావు, వర్మ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీయూసీ బలోపేతానికి కృషి



వైఎస్సార్‌టీయూసీ ప్రధానకార్యదర్శి రమణారెడ్డిని అభినందిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో వైఎస్సార్‌టీయూసీ బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానని స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్‌టీయూసీ ప్రధానకార్యదర్శి డి.వి.రమణారెడ్డి అన్నారు. నూతన ప్రధానకార్యదర్శిగా నియమితులైన సందర్భంగా శనివారం రమణారెడ్డిని స్టీల్‌ప్లాంట్ యూనియన్ పాయింట్ వద్ద పలువురు సత్కరించారు. ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో వైఎస్సార్‌టీయూసీకి పూర్వ వైభవం తెచ్చేలా ప్రయత్నిస్తానన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనలు, ఆదేశాల మేరకు అఖిలపక్ష కార్మిక సంఘాలతో కలిసి పని చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కర్రి దాలినాయుడు, డి. పుల్లారావు, శంకర్ సాయిరామ్, పేర్ల నూకరాజు, అండిబోయిన అప్పారావు, శశిభూషణ్, డి. అప్పలరాజు, నరశింగరావు, డి.వి.టి. రెడ్డి, తిప్పల గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు నిర్మాణ పనులకు శ్రీకారం



హౌసింగ్ బోర్డు కాలనీలో పార్కు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పల్లా

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో కొత్తగా నిర్మించనున్న పార్కు పనులకు శనివారం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. అలాగే రూ.2 కోట్లతో చేపట్టనున్న వాటర్ పైప్‌లైన్ పనులకు కూడా ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేబీఆర్ వాటర్ ప్లాంట్ వద్ద ఫిల్టర్ అయిన తర్వాత కొంత నీరు కాలువల ద్వారా వృథాగా పోతూ సముద్రంలో కలిసి పోతుందన్నారు. ఆ నీటి వృథాను అరికట్టి పార్కులోని మొక్కలకు వినియోగించే విధంగా పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సుమారు ఐదున్నర ఎకరాల్లో పార్కును రూ.10 కోట్లతో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పార్కులోనే షటిల్ కాక్, బాక్స్ క్రికెట్, స్కేటింగ్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, నాయకులు కాతా బాలకృష్ణ, బాసెట్టి అప్పారావు, తాటికొండ సుదర్శన్, కూన వెంకటరావు, ప్రసాద్, రాజా, రాజు, పీత రమణ, బొడ్డు సత్యారావు, పంచదార్ల ఉగ్రం పాల్గొన్నారు.

వైభవంగా సారె ఊరేగింపు



సారె ఊరేగింపులో కార్పొరేటర్ తిప్పలవంశీరెడ్డి, మహిళలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు దయాల్‌నగర్‌లో గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు అత్యంత ఘనంగా నిర్వహించారు. గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఊరేగింపులో మహిళలు వివిధ రకాల స్వీట్లు, పండ్లు గౌరీ పరమేశ్వరులకు సమర్పించారు. కార్యక్రమంలో 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, గౌరీ సేవా సంఘం ప్రతినిధులు ఆడారి రాము,ఆడారి సూరి,శ్రీను, పవన్, మహాలక్ష్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీయూసీ నాయకుడికి సత్కారం



పదవీ విరమణ చేయనున్న అప్పారావును సత్కరిస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్‌టీయూసీ సీనియర్ నాయకుడు గొందేశి అప్పారావును శనివారం ఘనంగా సత్కరించారు. స్టీల్‌ప్లాంట్ సివిల్ ఇంజినీరింగ్ విభాగం సీనియర్ చార్జిమెన్‌గా విధులు నిర్వహిస్తున్న అప్పారావు ఈనెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా యూనియన్ పాయింట్ వద్ద అప్పారావును సత్కరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నక్కా వెంకటరమణ మాట్లాడుతూ 33 ఏళ్లు పని చేసి కర్మాగారం అభివృద్ధి కోసం అప్పారావు ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మార్పుపూడి పరదేశి,పిట్టారెడ్డి, జి. అప్పలరెడ్డి, దరిగి రవి, కె. విజయకుమార్, పి. పెంటయ్య, బి.వి. రామయ్య, ఇ. సన్యాసిరావు, నమ్మి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

జగ్గు జంక్షన్ ఆధునికీకరణ పనుల పరిశీలన

గాజువాక: జీవీఎంసీ 72వ వార్డులోని జగ్గు జంక్షన్ ఆధునికీకరణ పనులను వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.66 లక్షలతో చేపట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. నాలుగు రోడ్ల జంక్షన్‌గా దీన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. రోడ్ల వెడల్పుతో పాటు కాలువల నిర్మాణానికి పనులు చేపట్టామని తెలిపారు. కసిరెడ్డి సత్యనారాయణ, జి.ఆనంద్, అప్పారి విష్ణుమూర్తి, కె.అచ్యుతరావు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల వితరణ



నిత్యావసర సరకులు అందిస్తున్న పద్మమార్కండేయ సేవా సంఘం ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడికి చెందిన శ్రీపద్మ మార్కండేయ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం నిరుపేద కుటుంబానికి నెలకు సరిపడా బియ్యం, ఇతర నిత్యావసర సరకులు అందించారు. పెదమడకకు చెందిన గంధోళి సోమరాజు కుటుంబ సభ్యులు రమణమ్మ, అప్పలకొండ తదితరులు వీటిని సమకూర్చారు. కార్యక్రమంలో సేవా సంఘం ప్రతినిధులు బేతా లక్ష్మి, హనుమంతురావు, కొలిపాక అప్పారావు, దొడ్డి దేముడు పాల్గొన్నారు.

మంచినీరు వృథా



అక్కిరెడ్డిపాలెం సర్వీసు రోడ్డులో వృథాగా పోతున్న మంచినీరు

అక్కిరెడ్డిపాలెం: మంచినీటి పైపు లీకై మంచినీరు వృథాగా పోతుంది. జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం వాటర్ ట్యాంక్ వద్ద సర్వీసు రోడ్డు పక్కన మంచినీటి పైపు నుంచి భారీగా నీరు లీకవడంతో వరదనీరులా ప్రవహిస్తోంది. ఇప్పటికే గ్రామంలో పలు ప్రాంతాల్లో అరకొరగా మంచినీరు వస్తుందని చెబుతున్నారు. అధికారులు పర్యవేక్షించకపోవడం వల్ల ఈ పరిస్థితి తలెత్తుతుందని ఆరోపిస్తున్నారు. మంచినీటి విభాగం అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా సత్యసాయి జయంతి వేడుకలు



ఉక్కు మందిరంలో పేదలకు సరకులు అందజేస్తున్న ఉన్నతాధికారులు



వేడుకల్లో పాల్గొన్న భక్తులు



ఉక్కునగరం: సత్యసాయి జయంతి వేడుకలు శనివారం ఉక్కునగరంలో వైభవంగా జరిగాయి. స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో వేకువజామున ఓంకారం, నగర సంకీర్తన , సుప్రభాతం నిర్వహించారు. హనుమాన్‌చాలీసా పారాయణం, రుద్రాభిషేకాలు ప్రారంభమయ్యాయి. ఎల్‌బీ కాలేజీ విశ్రాంత ప్రొఫెసర్ యు. సుధాకరరావు చేసిన ఆధ్యాత్మిక ప్రసంగం ఆకట్టుకుంది. విశ్వశాంతి కోసం సాయి గాయత్రీ యజ్ఞం నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేదలకు నెలకు సరిపడే కిరాణా సామగ్రితో పాటు అమృత కళశాలు అందజేశారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ జి. రామకృష్ణ, ఉక్కు విశ్రాంత డైరెక్టర్ ఎస్.ఎస్. రావు, ఉన్నతాధికారులు రంజన్ మొహంతి, గౌతమ్‌తో పాటు పలువురు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అక్కిరెడ్డిపాలెం: సత్యసాయి బాబా ఆరాధనోత్సవాలను శనివారం పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ ఎదురుగా కుంచమాంబ, దుర్గమాంబ అమ్మవార్ల ఆలయం వద్ద అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం భజన మండలి ఆధ్వర్యంలో సత్యసాయి బాబా ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం భారీ సమారాధన నిర్వహించారు. గుడివాడఅప్పన్నకాలనీ, బీహెచ్‌పీవీ భజనమండలి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్, సంద్రాన నూకరాజు, భజన మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

చిట్టి చేతులు..గట్టి ప్రదర్శనలు

- ఆలోచింప జేసిన నమూనాలు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో డీఈవో అప్పారావునాయుడు, ఉపాధ్యాయులు



పర్యావరణ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న డీఈవో అప్పారావునాయుడు



అలరించిన పర్యావరణ సాంస్కృతిక నృత్య ప్రదర్శన

అగనంపూడి: జీవకోటికి ఆధారం ప్రాణవాయువు, అటువంటి ప్రాణవాయువునిచ్చే చెట్లను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అనకాపల్లి డీఈవో అప్పారావునాయుడు అన్నారు. జిల్లా విద్యాశాఖ, ఏపీఎస్‌జీసీ ఆధ్వర్యంలో లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అనకాపల్లి జిల్లా స్థాయి పర్యావరణ సైన్స్ కాంగ్రెస్–2024లో భాగంగా పోస్టర్ ప్రదర్శన, వేస్ట్ టు బెస్ట్ మోడళ్ల ప్రదర్శన ఏర్పాటు చేశారు. జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి ఉన్నచోటే జంతువులు, పక్షులు మనుగడ సాధ్యమన్నారు. పాఠశాల హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అనకాపల్లి, విశాఖ జిల్లాల ఏపీఎస్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్లు శిష్టు ఖగేశ్వరరావు, ఎస్.బాబూరావు, ఏపీఎస్‌జీసీ పీవో ప్రసాద్, జూరీ కమిటీ ప్రతినిధి సీహెచ్. పెద్దినాయుడు, క్లస్టర్ కోఆర్డినేటర్ బి.అన్నాజీరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేతలు వీరే...

పోస్టర్ ప్రజెంటేషన్‌లో...

పోస్టర్ ప్రజెంటేషన్‌లో మొదటి బహుమతి వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల పదో తరగతి విద్యార్థి నండూరి గీతాశ్రీ, ద్వితీయ బహుమతి కుసర్లపూడి పాఠశాల విద్యార్థి ఎం.కార్తీ రక్షిత్, తృతీయ బహుమతి రోలుగుంట పాఠశాలకు చెందిన ఎస్.హర్షిణి దక్కించుకన్నారు.

వేస్ట్ టు బెస్ట్‌లో..

వేస్ట్ టు బెస్ట్ ప్రదర్శనలో పరవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సీహెచ్.లాస్య, ద్వితీయ స్థానం లంకెలపాలెం హైస్కూల్ విద్యార్థి సీహెచ్. భాగ్యలక్ష్మి, తృతీయ స్థానం మామిడిపాలేనికి చెందిన పి.సాయి దుర్గా ప్రసాద్ దక్కించుకున్నారు. అలాగే రెండు విభాగాల్లో ప్రత్యేక ప్రశంసా బహుమతులను పి.సాయి దుర్గా ప్రసాద్, టి.దుర్గా ప్రసాద్, ఎస్.ఝాన్సీ, సీహెచ్.భాగ్యలక్ష్మి, కె.ఫణికుమార్, పి.జయవర్ధన్ అందుకున్నారు.

విశాఖ పర్యటనలో స్టీల్‌ప్లాంట్‌పై ప్రధాని ప్రకటన చేయాలి

- సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కే ఎస్వీ కుమార్



మీడియాతో మాట్లాడుతున్న సీఐటీయూ నేత కుమార్

సీతమ్మధార: ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 29న విశాఖ పర్యటన సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగుతుందని ప్రకటించాలని సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కే ఎస్వీ కుమార్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ఈనెల 26న నిర్వహించనున్న కార్మిక కర్షక ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరుతూ బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా విశాఖలో అన్ని వర్గాల ప్రజలు 1,400 రోజుల నుంచి ఐక్యంగా పోరాడుతున్నారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ సెయిల్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రధాని ప్రకటించకుంటే.. ఆంధ్ర రాష్ట్రానికి, తెలుగు ప్రజలకు తీరని ద్రోహం చేసి నట్లేనన్నారు. నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విధానాల వల్ల కార్మిక వర్గం, రైతాంగం తీవ్రంగా నష్టపోతుందన్నారు. అదానీతో చేసుకున్న ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 26వ తేదీన దేశవ్యాప్తంగా అఖిలపక్ష కార్మిక సంఘాలు, సంయుక్త కిషన్ మోర్చా పిలుపు మేరకు భారీ ప్రదర్శన సభలు జరుగుతున్నాయన్నారు. విశాఖలో ఆ రోజు ఉదయం దొండపర్తి రైల్వే డీఆర్ఎం ఆఫీస్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు కార్మిక ప్రదర్శన సభ జరుగుతుందన్నారు. ఈనెల 24వ తేదీన ఉదయం 9 గంటలకు పాత గాజువాక నుంచి కార్మిక ప్రదర్శన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎఫ్‌టీయూ కార్యదర్శి దేవ, సీఐటీయూ నాయకులు వై.రాజు, ఎం.సుబ్బారావు, పి.వెంకట్ రెడ్డి, జి.అప్పలరాజు, పి.వెంకట్రావు, ఉరుకుటి రాజు, నూకరాజు, సింహాచలం, వి.వి.కష్టారావు అప్పారావు కుమారి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సంక్రాంతి కానుక



చెక్కులతో పారిశుధ్య కార్మికులు

గాజువాక: జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు ఈ ఏడాది సంక్రాంతి కానుకగా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1000 విలువైన చెక్కులను శనివారం అందజేశారు.కొంత మందికి బ్యాంకు ద్వారా కానుక నగదు చెల్లించగా మిగిలిన వారికి చెక్కులు ఇచ్చారు. కాగా, లిస్టులో లేనివారు ఇంకా ఉన్నారని అందరికీ సంక్రాంతి కానుక నగదు మంజూరు చేయాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గాజువాక జోన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు కోరారు.